

చిన్నారి కోడి పుంజు బంగారు మేని గాను

రష్యన్ జానపద కథ

అనుసరణ ఎ. యస్. తాల్‌స్తోయ్

అనువాదం: గిడుతూరి సూర్యం

చిత్రాలు: ఇ. రచేవ్



అనగా అనగా ఒక అడవిలో ఓ చిన్ని యిల్లు. ఆ యింట్లో ఒక పిల్లి, ఒక నల్లపిట్ట, చిన్నారి కోడిపుంజు నివసిస్తుండేవి. పిల్లీ, నల్లపిట్టా ప్రతిరోజూ చిన్నారి పుంజును ఇంటివద్దనే వదలిపెట్టి కట్టెలు నరకడానికని అడవిలోకి చాలా దూరం వెళ్లేవి. అలా వెళ్లేముందు చిన్నారి పుంజును హెచ్చరించేవి:

"మేము చాలా దూరం వెళ్తున్నాం. నీవు ఇక్కడే ఇల్లు కనిపెట్టుకొని ఉండు. కాని గోల చేయకు సుమా! ఒక వేళ గుంటనక్క వస్తే మాత్రం కిటికీలోనుంచి తొంగిచూడకు. తెలిసిందా?"

పిల్లీ, నల్లపిట్టా అటు వెళ్లాయని తెలుసుకోగానే నక్క ఆ చిన్ని యింటికి పరుగున వచ్చింది. కిటికీక్రిందే కూర్చుని పాట ప్రారంభించింది:

"చిన్నారి కోడిపుంజు
బంగారు మేని గౌను
రంగారు కెంపు శిఖ
సొంపారు నెంతో సఖ
ఒకమారు వెలికి రమ్ము
బఠాణీ లందుకొమ్ము!"

చిన్నారి పుంజు కిటికీలోనుంచి తొంగిచూసింది. చటుక్కున నక్క పుంజుపై బడిపట్టుకుంది. తన గుంట దగ్గరకి లాక్కుపోతోంది.

చిన్నారి పుంజు కేకలేసింది:

"లోతైన నదులకు ఆవలగా
ఎత్తైన నగముల కీవలగా
నక్క నన్నెత్తుకు పోతున్నది.
నల్లపిట్టా రమ్ము
నాదుపిల్లీ రమ్ము
వేగమే రారండి
రక్షింప రండి!"



చిన్నారి పుంజు వేసిన కేకలు పిల్లికీ, నల్లపిట్టకీ వినబడ్డాయి. అవి నక్క వెంబడి పరుగెత్తాయి. దాని దగ్గరనుండి చిన్నారి పుంజును లాక్కున్నాయి.

మళ్లీ అడవిలోకి కట్టెలు కొట్టడానికి వెళ్లేముందు పిల్లీ, నల్లపిట్టా మన చిన్నారి కోడి పుంజును హెచ్చరించాయి:

"చిన్నారి పుంజూ! ఈ సారైనా కిటికీలోనుంచి తొంగిచూడకేం! ఈవేళ మేము చాలా దూరం వెళ్తున్నాం. నీవు అరిస్తే మాకు వినిపించకపోవచ్చు."

అవి అలా వెళ్లిపోగానే నక్క పరుగున ఆ చిన్ని యింటికి వచ్చింది. పాట ప్రారంభించింది:

"చిన్నారి కోడిపుంజు
బంగారు మేని గౌను
రంగారు కెంపు శిఖ
సొంపారు నెంతొ సఖ
ఒకమారు వెలికి రమ్మ
బఠాణీ లందుకొమ్మ!"

చిన్నారి పుంజు కదలకుండా మెదలకుండా కూర్చుంది. అంచేత జిత్తులమారి నక్క మళ్లీ పాడింది:

"ఆడుతూ పాడుతూ బాలబాలికలు
వీధిలో ఈవేళ వెదజల్లె గోధుమలు
కోడిపెట్టల గుంపు మెక్కుతూ అచట
చిన్ని పుంజుల కిడవు గింజైన అకట."



చిన్నారి పుంజు కిటికీలోనుంచి తొంగిచూసి అన్నది:

"కొ...క్కు...రో...కో...కొక్కురోకో
చిన్ని పుంజులకేల యివ్వవో, నీవు
చెప్పవయ్యా నాకు ఓ నక్క బావ."

అప్పుడు నక్క చిన్నారి కోడిపుంజును చటుక్కున పట్టుకొని, చంకలో పెట్టుకొని తన గుంటదగ్గరకి లాక్కుపోతోంది. చిన్నారి పుంజు కేక లేసింది:

"లోతైన నదులకు ఆవలగా
ఎత్తైన నగముల కీవలగా
నక్క నన్నెత్తుకు పోతున్నది.
నల్లపిట్టా రమ్మ
నాదుపిల్లీ రమ్మ
వేగమే రారండి
రక్షింప రండి!"

పిల్లీ, నల్లపిట్టా చిన్నారి పుంజు కేకలు విన్నాయి. నక్కను వెంబడించాయి. పిల్లి పరుగెత్తింది. నల్లపిట్ట ఎగిరింది. ఎలాగైతేనేం నక్కను అందుకున్నాయి. పిల్లి


Е.Р.

గోళ్లతో రక్కింది. నల్లపిట్ట ముక్కుతో పొడిచింది. రెండూ చిన్నారి పుంజును కాపాడాయి.

పిల్లీ, నల్లపిట్టా మళ్లీ అడవిలోకి వెళ్లడానికి తయారయా యి, ఈసారి ఇంకా ఎక్కువ దూరం వెళ్లి కట్టెలు కొట్టడానికి. ఈమాటు చిన్నారి పుంజును అవి గట్టిగా హెచ్చరించాయి:

"నక్క మాటలు నమ్మకు. కిటికీలోనుంచి తొంగిచూడకు. ఈ రోజు మేం ఇంకా ఎక్కువ దూరం వెళ్తాం. ఈసారి నీవు అరిస్తే నీ కేకలు మాకు వినిపించవు. తెలిసిందా?"

అలా చెప్పి పిల్లీ, నల్లపిట్టా కట్టెలు కొట్టడానికని అడవిలోకి బహు దూరంగా వెళ్లిపోయాయి. వెనువెంటనే నక్క ఆ కిటికీక్రిందికొచ్చి కూర్చుని పాడింది:

"చిన్నారి కోడిపుంజు
బంగారు మేని గౌను
రంగారు కెంపు శిఖ
సొంపారు నెంతో సఖ
ఒకమారు వెలికి రమ్మ
బఠాణీ లందుకొమ్మ."



చిన్నారి పుంజు కదలకుండా మెదలకుండా కూర్చుంది. నక్క మళ్లీ పాడింది:

"ఆడుతూ పాడుతూ బాలబాలకలు
వీధిలో ఈవేళ వెదజల్లె గోధుమలు
కోడిపెట్టల గుంపు మెక్కుతూ అచట
చిన్ని పుంజుల కిడవు గింజైన అకట."

చిన్నారి పుంజు కదలకుండా మెదలకుండా కూర్చుంది. అంచేత జిత్తుల మారి నక్క మళ్లీ పాడింది:

"ఎందరో వీధిలో నడచి ఈవేళ
ఎన్నెన్నొ పప్పులను వెదజల్లె నేల
కోడిపెట్టల గుంపు మెక్కుతూ అచట
చిన్ని పుంజుల కిడవు గింజైన అకట."

చిన్నారి పుంజు కిటికీలోనుంచి తొంగిచూసి అన్నదికదా:

"కొ...క్కు...రో...కో...కొక్కురోకో
చిన్ని పుంజులకేల యివ్వవో, నీవు
చెప్పవయ్యా నాకు ఓ నక్క బావ."

నక్క చిన్నారి పుంజును చటుక్కున పట్టుకొని, లోతైన నదులకు ఆవలగా, ఎత్తైన నగముల కీవలగా తన గుంటదగ్గరకి లాక్కుపోయింది.



చిన్నారి పుంజు తన శక్తి కొద్దీ కేకలేసింది. కాని పిల్లికీ, నల్లపిట్టకూ ఆ కేకలు వినిపించలేదు. అవి ఇంటికి వచ్చి చూడగా చిన్నారి పుంజు కనిపించ లేదు.

నక్క అడుగు జాడలంటే పిల్లి పరుగెత్తింది, నల్లపిట్ట ఎగిరింది. చిట్టచివరికి నక్కగుంట దగ్గరకి వచ్చాయి. పిల్లి వాయిద్యం వాయిస్తూ పాడింది:

"చక్కనీ రాగాన్ని సొగసుగా వాయిస్తా,
చెల్లాయి నక్కకో పాట వినుపిస్తా,
చిట్టినా చెల్లాయి తిరుగబోయిందా,
ఇంటిలోనే చిన్న నిదుర తీస్తూందా?"

నక్క పిల్లిపాట విన్నది. తనలో తాను అనుకుందికదా:

"ఎవరబ్బా! ఎంతో చక్కగా వాయిస్తూ, ఎంతో కమ్మగా పాడుతున్నారు? తప్పకుండా చూడాలి."

తన గుంటలోనుంచి నక్క వెలుపలికి వచ్చింది. పిల్లీ, నల్లపిట్టా చటుక్కున నక్కపై పడి, చెడామడా బాగా దెబ్బలు కొట్టాయి. వాటి దెబ్బలు తట్టుకోలేక నక్క తోక ముడుచుకొని కాళ్లల్లో శక్తి ఉన్నంతవరకు పరుగో పరుగోమని పారి పోయింది.



పిల్లీ, నల్లపిట్టా చిన్నారి కోడిపుంజును ఒక బుట్టలో పెట్టుకొని యింటికి తీసుకువెళ్లిపోయాయి.

ఈనాటివరకు అవి అడవిలో ఆ చిన్ని యింట్లో సుఖంగా ఉంటున్నాయి.

కథ కంచెకి మనం యింటికి.



Петушок — золотой гребешок

РУССКАЯ НАРОДНАЯ СКАЗКА

На языке телугу

П $\frac{70802\text{-}416}{014\ (01)\text{-}80}$ 914-80

4803010102

"ప్రగతి" ప్రచురణాలయం

మాస్కో